అసైన్డ్ భూముల అన్యాక్రాంతంపై విచారణ

- ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు
- ఆదేశించిన సీఎం

7లో

మెదక్ ఎస్పీగా బాలస్వామి



మెదక్ అర్బన్, జనవరి 3 : మెదక్ జిల్లా ఎస్పీగా డా.బాలస్వామి బదిలీపై రానున్నారు. మొన్నటి వరకు ఇక్కడ ఎస్పీగా పనిచేసిన రోహిణి ప్రియదర్శిని గత డిసెంబరు 17న బదిలీ అయ్యారు. అప్పటి నుంచి కామారెడ్డి జిల్లా ఎస్పీ సింధూశర్మ ఇన్‌చార్జి ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. బుధవారం ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఐపీఎ స్‌లను బదిలీ చేయగా 2018 బ్యాచ్‌కు చెందిన బాలస్వామిని మెదక్ జిల్లా ఎస్పీగా నియమిస్తూ సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన 2020లో మెదక్ అడిషనల్ ఎస్పీ అడ్మిన్‌గా పనిచేశారు.

సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా వల్లూరు క్రాంతి

- **ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీగా శరత్**



బదిలీపై రానున్న కలెక్టర్ క్రాంతి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి సంగారెడ్డి, జనవరి 3 : సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా వల్లూరు క్రాంతి నియమితులయ్యారు. ఇంతవరకు కలెక్టర్‌గా ఉన్న డాక్టర్ ఎ.శరత్ ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీగా బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలుకు చెందిన వల్లూరు క్రాంతి 2016 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి. ఆమె పాఠశాల విద్యను కర్నూలులో అభ్యసించారు. ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లో చదివారు. అనంతరం ఐఐటీ ఢిల్లీలో ఇంజనీరింగ్ పూర్తి చేసి, అక్కడే శ్రీరామ్ ఇనిస్టిట్యూట్‌లో ఆర్నేళ్ల పాటు ఐఏఎస్ శిక్షణ తీసుకున్నారు. 2013, 2014లో సివిల్స్ రాసినా ఐఏఎస్ సర్వీసు రాలేదు. పట్టుదలతో 2015లో మళ్లీ రాశారు. 2016లో వచ్చిన ఫలితాలలో 65వ ర్యాంక్‌తో ఐఏఎస్ సాధించింది. కేంద్రం తెలంగాణ క్యాడర్‌కు కేటాయించడంతో ఆమె నిర్మల్ జిల్లాలో శిక్షణ పొందారు. అనంతరం మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రత్యేకాధికారిగా, కరీంనగర్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారు. అనంతరం క్రాంతి జోగులాంబ-గద్వాల జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. తాజా బదిలీలలో క్రాంతి అక్కడి నుంచి సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వస్తున్నారు. ఇక క్రాంతి తల్లిదండ్రులు లక్ష్మీ, రంగారెడ్డి. సోదరి నీలిమ డాక్టర్‌గా ఉన్నారు. ఇలా ఉండగా డాక్టర్ ఎ.శరత్ 2022 జూన్ 18న బాధ్యతలు చేపట్టి 18 నెలలకుపైగా సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు.

బసవేశ్వర, సంగమేశ్వర గతేంటి?

- ప్రస్తుతానికి నిలిచిన ఎత్తిపోతల పథకం పనులు
- రెండు ప్రాజెక్టులు రద్దయినట్లు ప్రచారం
- మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పందించడంతో స్పష్టత
- మార్పులు చేస్తున్నామని ప్రకటన

నారాయణఖేడ్, జనవరి 3: సంగారెడ్డి జిల్లాలో నాలుగు నియోజకవర్గాలకు సాగునీరు అందించడానికి చేపట్టిన బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పథకాల పనులు ప్రశ్నార్థకంగా మారాయి. సంగారెడ్డి జిల్లాలోని మంజీరా పరీవాహక ప్రాంతంలో ఉన్న 20 మండలాలకు సాగునీరు అందించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ఎత్తిపోతల పథకాలను చేపట్టింది. బసవేశ్వర ఎత్తిపోతల పథకం ద్వారా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మనూరు, నాగల్‌గిద్ద, కంగ్టి, కల్హేర్, సిర్గాపూర్, నారాయణఖేడ్, అందోల్ నియోజకవర్గంలోని రేగోడు, వట్‌పల్లి, మండలాల్లోని లక్షా 65 వేల ఎకరాలకు నీటిని అందించేందుకు 8 టీఎంసీల సామర్థ్యంతో రూ.1,774 కోట్లతో ప్రాజెక్టును చేపట్టారు. సంగమేశ్వర ద్వారా జహీరాబాద్ నియోజకవర్గంలోని రాయికోడ్, మునిపల్లి, కోహీర్, ఝరాసంగం, జహీరాబాద్, న్యాల్‌కల్, మొగుడంపల్లితోపాటు సంగారెడ్డి నియోజకవర్గంలోని సదాశివపేట, కొండాపూర్, కంది మండలాల్లోని 2 లక్షల 19 వేల ఎకరాలకు నీటిని అందించడానికి 12 టీఎంసీల సామర్థ్యంతో 2,500 కోట్లతో ప్రాజెక్టును చేపట్టారు.

నామమాత్రంగానే పనులు

2022 ఫిబ్రవరిలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. గతేడాది టెండర్లను పూర్తి చేయగా మెగా ఇంజనీరింగ్ కంపెనీ దక్కించుకున్నది. మల్లన్నసాగర్ ప్రాజెక్టు నుంచి సింగూరులోకి నీటిని మళ్లించి ఎత్తిపోతల ద్వారా సాగునీటిని అందించాలి. దీని కోసం మనూరు మండలం బోరంచ వద్ద పంపుహౌస్‌లను నిర్మించే పనులను ఏడు నెలల క్రితం ప్రారంభించారు. పంపుహౌస్ కోసం 34 ఎకరాల భూమిని సేకరించి, లెవలింగ్ పనులు చేపట్టారు. ఈ పనులు మినహా ప్రాజెక్టు నిర్మాణం ముందుకు సాగలేదు. రైతులు కోర్టుకు వెళ్లడంతో సంగమేశ్వర ప్రాజెక్టు పనులకు ఆటంకం ఏర్పడింది. కొన్నిరోజుల క్రితం ప్రాజెక్టు పరిధిలో పనులు చేపట్టిన సంస్థకు సంబంధించిన యంత్ర పరికరాలను తరలించుకుపోయారు. కార్మికులు ఎక్కడా కనిపించడం లేదు. దీంతో కొత్తగా వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఈ రెండు ప్రాజెక్టు పనులను రద్దు చేసినట్లుగా ప్రచారం కొనసాగింది.

మార్పులే.. రద్దు చేయలేదు

గత ప్రభుత్వం చేపట్టిన పథకాలపై కాంగ్రెస్ సర్కారు పునరాలోచన చేస్తుండడంతో ఈ ఎత్తిపోతలపై స్థానికంగా ఆందోళన రేకెత్తింది. మంగళవారం నారాయణఖేడ్ నియోజకవర్గంలో పర్యటించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ ఈ విషయంపై స్పందించడంతో స్పష్టత వచ్చింది. తక్కువ ఖర్చుతో అధిక ఆయకట్టుకు సాగునీరు అందించే విధంగా మార్పులు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. దీంతో ప్రాజెక్టులను రద్దు చేయలేదని స్పష్టత వచ్చింది.

పండుగకు వెళ్లిన కార్మికులు తిరిగి రాలేదు

బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పథకాలకు సంబంధించి పనులు చేపడుతున్న కార్మికులు పండుగల కోసమని వెళ్లి తిరిగి రాలేదు. ఈ పథకాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. బోరంచ వద్ద పంపుహౌస్‌ల లెవలింగ్ పనులు పూర్తయ్యాయి. దీంతో పనులు చేపట్టిన సంస్థ యంత్రాలను మరో చోటుకు తరలించింది. రైతులు కోర్టుకు వెళ్లడంతో సంగమేశ్వర పనులు ముందుకు సాగలేదు. బసవేశ్వర పథకానికి సంబంధించి రూ.7 కోట్ల చెల్లింపులు జరిగాయి.

-జైభీమ్, నీటిపారుదల శాఖ ఈఈ



బోరంచ వద్ద ఆగిపోయిన బసవేశ్వర ఎత్తిపోతల పనులు



మెదక్ గ్రంథాలయంలో ప్రిపరేషన్‌లో యువత

మెదక్ జిల్లాలో 525 ఉపాధ్యాయ ఖాళీలు

మెదక్ జిల్లాలో మొత్తం 525 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాకు 3,959 పోస్టులు మంజూరు కాగా 3,434 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. మరో 525 ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయడం ద్వారా జిల్లాలో ఉపాధ్యాయుల కొరత తీరనుంది.

ఉపాధ్యాయ ఖాళీల వివరాలు	
స్కూల్ అసిస్టెంట్	284
ప్రాథమిక పాఠశాల హెడ్‌మాస్టర్(తెలుగు)	58
భాషా పండితులు	30
సెకండరీ గ్రేడ్ టీచర్లు	153

మెగా డీఎస్సీపై ఆశలు

- 2016 తర్వాత మళ్లీ డీఎస్సీ
- సిద్ధమవుతున్న నిరుద్యోగులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, మెదక్ జనవరి 3 : ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయటానికి వీలుగా త్వరలో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఏళ్ల తరబడిగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న వారందరూ మళ్లీ పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు సిద్ధమవుతున్నారు. గతేడాది సెప్టెంబరు15న టెట్ నిర్వహించిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు నెలల్లో డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేస్తామని ప్రకటించింది. ఈ క్రమంలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో డీఎస్సీ నిర్వహణకు అవకాశం లేకుండా పోయింది.

ప్రతీ పల్లెలో ప్రభుత్వ పాఠశాల

ప్రతీ పల్లెలో ప్రభుత్వ పాఠశాల ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఈ నేపథ్యంలో మూతపడిన సర్కారు బడులు తిరిగి తెరుచుకుంటున్నాయి. విద్యార్థులు లేక కొన్ని చోట్ల, ఉపాధ్యాయులు కొరతతో మరికొన్ని చోట్ల ప్రభుత్వ పాఠశాలలను మూసివేశారు. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలు తమ పిల్లలను పట్టణ ప్రాంతాల్లోని ప్రైవేట్ పాఠశాలలకు పంపించాల్సి వస్తోంది. ప్రతీ పంచాయతీ, తండాల్లో ప్రభుత్వ పాఠశాల తెరిపించాలనే నిర్ణయంతో ఉపాధ్యాయ ఖాళీలు కూడా పెరిగే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

కోచింగ్ సెంటర్ల బాట పట్టిన నిరుద్యోగులు

మెగా డీఎస్సీ నిర్వహిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో నిరుద్యోగులు కోచింగ్ సెంటర్ల బాట పడుతున్నారు. 2016 తర్వాత ఇంతవరకు డీఎస్సీ నిర్వహించలేదు. దాదాపు ఏడేళ్ల తరువాత ఉపాధ్యాయ ఖాళీల భర్తీపై ప్రకటన రావడంతో ఎలాగైనా జాబ్ కొట్టాలన్న కసితో నిరుద్యోగులు సిద్ధమవుతున్నారు. కొందరు స్థానికంగా ఉన్న గ్రంథాలయాల్లో చదువుకుంటున్నారు. మరికొందరు హైదరాబాద్‌కు వెళుతున్నారు. ఇప్పటికే టెట్ అర్హత సాధించిన వారు డీఎస్సీకి ప్రిపేరు అవుతున్నారు. అందివచ్చిన అవకాశాన్ని ఈసారి చేజార్చుకోవద్దన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

ఖేడ్ మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాసం

- కలెక్టర్ కార్యాలయ ఏవోకు నోటీసు అందజేసిన కాంగ్రెస్ కౌన్సిలర్లు

నారాయణఖేడ్, జనవరి 3: నారాయణఖేడ్ మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనాబేగంనజీబ్, వైస్‌చైర్మన్ పరశురాంపై కాంగ్రెస్ కౌన్సిలర్లు బుధవారం కలెక్టర్ కార్యాలయ ఏవో పరమేశ్వర్‌కు అవిశ్వాసం నోటీసును అందజేశారు. కౌన్సిలర్లు ఆనంద్ స్వరూప్‌షెట్కార్, లక్ష్మీబాయి, దారం శంకర్, రాజేష్‌చౌహాన్, నర్సింలు, సవిత, వివేకానంద్, ఫరానాబేగం, మాజీద్, సంధ్యారాణి సంగారెడ్డికి వెళ్లి వారి సంతకాలతో కూడిన నోటీసును కలెక్టర్ కార్యాలయ ఏవోకు అందజేశారు. అయితే ఖేడ్ మున్సిపాలిటీలో 15 వార్డులకు ముగ్గురు కౌన్సిలర్లు ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ చేరగా వారి బలం పదికి చేరింది. అవిశ్వాస తీర్మానాన్ని నెగ్గడానికి అవసరమైన సంఖ్య ఉంది. చైర్మన్ పదవి బీసీ జనరల్‌కు రిజర్వ్ చేయబడింది. ఒకవేళ అవిశ్వాసం నెగ్గితే నూతన చైర్మన్‌గా 6వ వార్డు కౌన్సిలర్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్‌గా మూడో వార్డు కౌన్సిలర్ దారం శంకర్‌ను ఎన్నుకునే అవకాశం ఉంది.



కలెక్టర్ కార్యాలయ ఏవోకు అవిశ్వాసం నోటీసును అందజేస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

రేషన్‌కార్డు లేకున్నా దరఖాస్తు చేసుకోవచ్చు

- మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా



టేక్మాల్ మండలంలోని వెంకటాపూర్‌లో గ్రామసభను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాజర్షిషా

అల్లాదుర్గం/టేక్మాల్, జనవరి 3 : ఆరు గ్యారంటీల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకునే అర్హీదారులు తెల్లరేషన్ కార్డు లేకున్నా చేసుకోవచ్చునని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా బుధవారం కలెక్టర్ అల్లాదుర్గంలో, టేక్మాల్ మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ప్రజాపాలన గ్రామ సభలను సందర్శించారు. అల్లాదుర్గంలో పలువురు తమకు తెల్లరేషన్‌కార్డు లేదని, ఎలా దరఖాస్తు చేసుకోవాలంటూ కలెక్టర్‌తో మొరపెట్టుకున్నారు. దీంతో స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ రేషన్‌కార్డు లేని వారు దరఖాస్తు చేసుకున్నా స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. కాగా అల్లాదుర్గంలో బుధవారంతోనే ప్రజాపాలన కార్యక్రమం ముగిసినప్పటికీ గురువారం వరకు కౌంటర్లు ఇలాగే కొనసాగించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. 6 వరకు ప్రజలు ఆయా గ్రామపంచాయతీ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవచ్చునని స్పష్టం చేశారు.



కస్తూర్బాలో కలెక్టర్

మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా బుధవారం అల్లాదుర్గంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతిగృహంలోని విద్యార్థినులతో కలసి భోజనం చేశారు.

- అల్లాదుర్గం, జనవరి 3

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి: ఏసీపీ

హుస్నాబాద్, జనవరి 3: పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని హుస్నాబాద్ ఏసీపీ సతీష్ పోలీసు అధికారులకు సూచించారు. బుధవారం పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో హుస్నాబాద్ సర్కిల్ పోలీసు అధికారులతో నిర్వహించిన పెండింగ్ కేసుల సమీక్షా సమావేశంలో మాట్లాడారు. గంజాయి, కొకైన్, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి నిర్మూలించాలన్నారు. వరంగల్, కరీంనగర్ జిల్లాల సరిహద్దులో ఉన్నందున తరచూ వాహనాలను తనిఖీ చేయాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో టార్గెట్‌కు మించి ఎక్కువ కేసులు అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉండవద్దని, కేసులను ఛేదించి కోర్టులో చార్జిషీటు దాఖలు చేయాలని సూచించారు. మాస్కులు లేకుండా బయట తిరిగే వ్యక్తులపై పెట్టీ కేసులు నమోదు చేయాలన్నారు. నేరాల నియంత్రణకు పోలీసు గస్తీ, నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్కిల్ పోలీసులు ఏసీపీ సతీష్‌కు నూతన సంవత్సరం సందర్భంగా పూల మొక్క ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎర్రల కిరణ్, ఎస్ఐలు మహేశ్, వివేక్, తిరుపతి పాల్గొన్నారు.



ఏసీపీ సతీష్‌కు పూల మొక్క అందజేస్తున్న సీఐ కిరణ్‌తో పాటు ఎస్ఐలు

కల్తీ మందులు అమ్మితే చర్యలు

కొండపాక/జగదేవ్‌పూర్, జనవరి 3: కల్తీ మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ అన్నారు. కుకునూరుపల్లిలోని పలు ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ షాపులను బుధవారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. రైతులకు సరైన సేవలందిస్తూ వారు తీసుకున్న వాటికి రసీదులు అందివ్వాలని, ప్రతి దానికి బిల్ ఉండాలని తెలిపారు. షాప్‌లో కంపెనీలు వస్తువుల వివరాలతో పంపించే డాక్యుమెంట్స్ ఉంచాలన్నారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ అధికారిని ప్రియదర్శిని ఉన్నారు. అలాగే జగదేవ్‌పూర్‌లోని ఎరువులు, విత్తన, పురుగు ముందుల డీలర్లకు జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ బుధవారం అవగాహన కల్పించారు. అనంతరం దౌలాపూర్ రైతు సత్యనారాయణరెడ్డి పొలంలోని పంటలను పరిశీలించారు.

సెంట్రింగ్ బాక్సుల దొంగలపై కేసు

చిన్నశంకరంపేట, జనవరి 3: రాత్రివేళలో సెంట్రింగ్ బాక్సులను దొంగిలించిన ముగ్గురు వ్యక్తులను పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు. చిన్నశంకరంపేట మండలంలోని కొర్విపల్లి, చెన్నాయిపల్లి, మడూర్ గ్రామాల్లో మూడు రోజుల క్రితం మాసాయిపేటకు చెందిన సోహెల్, అంబాజీపేటకు చెందిన శరత్‌ప్రసాద్, చందాపూర్‌కు చెందిన ప్రశాంత్ సెంట్రింగ్ బాక్సులను దొంగిలించారు. మంగళవారం సాయంత్రం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో మండల కేంద్రంలోని అనంత పద్మనాభ గుట్ట వద్ద ట్రాలీ ఆటోలో సెంట్రింగ్ బాక్సులను తరలిస్తున్నారు. పోలీసులకు అనుమానం కలుగడంతో ముగ్గురిని పట్టుకుని విచారించగా బాక్సులను దొంగిలించినట్లు తెలిపారు. గతంలో కూడా తూప్రాన్, శివంపేట, వెల్దుర్తి, మెదక్, భూంపల్లి, దౌల్తాబాద్‌లో వారిపై మొత్తం 11 చోరీ కేసులు ఉన్నట్లు తెలిపారు. దుండగుల వద్ద 1135 సెంట్రింగ్ బాక్సులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నారాయణగౌడ్ వెల్లడించారు.

బస్సు ఆపని డ్రైవర్.. కిందికి దూకిన మహిళ

● కాలు పైనుంచి వెళ్లడంతో నుజ్జునుజ్జయిన కాలు

శివ్వంపేట, జనవరి 3: ఆర్టీసీ బస్సు నుంచి కిందపడి ఓ మహిళ గాయపడింది. శివ్వంపేట మండలంలోని ఉసిరికపల్లి పంచాయతీ తౌర్యతండాకు చెందిన దేవ్లీ అనే మహిళ బుధవారం మండల కేంద్రమైన శివ్వంపేటలోని పీఏసీఎస్ బ్యాంకుకు పనిమీద వెళ్లడానికి ఉసిరికపల్లి చౌరస్తా వద్ద బస్సు ఎక్కింది. బస్సులో ప్రయాణికులు ఎక్కువగా ఉండటం, దిగాల్సిన స్టేజీ దాటి పోవడంతో బస్సు ఆపాలంటూ డ్రైవర్, కండక్టర్‌ను కోరింది. వారు ఆపకపోవడంతో కొద్దిదూరం వెళ్లాక బస్సు మెల్లగా వెళ్తుండడంతో దిగేందుకు ప్రయత్నించి కిందపడింది. దీంతో బస్సు చక్రాలు ఆమె కాళ్ల పైనుంచి వెళ్లడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వెంటనే ఆమెను నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అక్కడ ప్రాథమిక వైద్యం చేసి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ శివారులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.


తీవ్రంగా గాయపడ్డ దేవ్లీ

ఆటో, బైక్ దొంగల అరెస్ట్

మెదక్ అర్బన్, జనవరి 3: జిల్లా కేంద్రంలో చోరీకి గురైన ఆటో, బైక్ దొంగలను అరెస్టు చేసి.. రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ వెంకటేష్ తెలిపారు. గతేడాది నవంబరులో పట్టణానికి చెందిన కుమ్మరి సత్యనారాయణ ఇంటి ఎదుట పార్కు చేసిన బైక్‌ను రంగారెడ్డి జిల్లా కర్మాన్‌ఘట్‌కు చెందిన దేవతమ్మల శివ ఎత్తుకెళ్లాడు. బుధవారం కామారెడ్డి వైపు బైక్‌ను అమ్ముదామని వెళ్తుండగా.. పోలీసులు పట్టుకుని పత్రాలు తనిఖీ చేయగా చోరీ చేసి తెచ్చినట్టు ఒప్పుకున్నాడు.

మెదక్ మండల పరిధిలోని గ్రామానికి చెందిన కిష్టయ్య ఆటో రిపేర్ కోసం గతేడాది డిసెంబరు 5న వెల్‌కం బోర్డు వద్ద హెచ్‌పీ పెట్రోల్ పంపులో పార్కు చేయగా.. ఆటోను దొంగిలించాడు. వడ్డెర కాలనీకి చెందిన ఉప్పు నవీన్, దౌల్తాబాద్ మండల పరిధిలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన జోగు స్వామిలు కలిసి ఆటోను విక్రయించడానికి వెళ్తుండగా.. పోలీసులు పట్టుకున్నారు. వారి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

5న నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా

● జిల్లా ఉపాధి అధికారి వందన

సంగారెడ్డి రూరల్, జనవరి 3: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఈ నెల 5న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి వందన బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డిలోని బైపాస్ రోడ్డులో పాత వెలుగు ఆఫీస్‌లో గల జిల్లా ఉపాధి కార్యాలయ ఆవరణలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. అభ్యర్థులు 18 నుంచి 30 సంవత్సరాలలోపు ఉండి పదవ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్హతలు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు సకాలంలో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని, పూర్తి సమాచారం కోసం 08455-271010 నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

అసైన్డ్ భూముల అన్యాక్రాంతంపై విచారణ

- ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు
- ఆదేశించిన సీఎం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి), జనవరి 3: ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు ప్రాంతాలలో జరిగిన అసైన్డ్ భూముల అన్యాక్రాంతంపై విచారణ జరపాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశించినట్లు తెలిసింది. కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తులయామ్‌తో పాటు మెదక్, సంగారెడ్డి జిల్లాలోని పలువురు కాంగ్రెస్ నాయకులు వేర్వేరుగా ఇటీవల సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి ఫిర్యాదు చేశారు. అసైన్డ్ భూములు ఎలా అన్యాక్రాంతమయ్యాయి..? అక్రమార్కుల చేతుల్లోకి ఎలా వెళ్లాయి..? అన్న అంశాలపై కాంగ్రెస్ నాయకులు వివరాలతో పేర్కొన్నట్లు తెలిసింది. సిద్దిపేట ప్రాంతంలో అభివృద్ధి పేరిట అసైన్డ్ భూములను తీసుకుని సొంత పేర్లతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా సంగారెడ్డి, మెదక్ ప్రాంతాలలో అసైన్డ్ భూములను కొందరు గతంలోనూ అధికార పార్టీ నేతలు, వారి అనుచరుల పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారని కాంగ్రెస్ నాయకులు వివరించారు. సిద్దిపేట, మిట్టపల్లి ప్రాంతాలలోని నాలుగు సర్వే నెంబర్లలో ఉన్న సుమారు 80ఎకరాల అసైన్డ్ భూములను అభివృద్ధి పేరిట అక్రమంగా ఆక్రమించుకున్నారని తమ ఫిర్యాదులో కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. అలాగే సంగారెడ్డి పట్టణ శివారులోని అసైన్డ్ భూములతో పాటు రామచంద్రాపురం మండలం కొల్లూరు, తెల్లాపూర్, మండల కేంద్రమైన అమీన్‌పూర్, పటాన్‌చెరు, జిన్నారం మండలాలలోని విలువైన భూములను గతంలోని అధికార పార్టీ నాయకులు ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి, సహకరించడంతో కోట్ల విలువైన అసైన్డ్ భూములను విలువ మారాయని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఇక జిన్నారం మండలం గడ్డపోతారం పంచాయతీ పరిధిలోని 900 ఎకరాల అసైన్డ్ భూమి టీఎస్ఐఐసీ సేకరించి, ప్రైవేటు పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్న యాజమాన్యాలకు అప్పగించిందని వారు ఫిర్యాదు చేశారు. ఈ ప్రాంతంలో రూ.కోట్లు చొప్పున ఉన్న ఎకరా భూమిని తమ నుంచి కోటి రూపాయలకు ఎకరా చొప్పున లాక్కున్నారని అక్కడి రైతులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. పంటలు పండించుకొని జీవిస్తున్న తమ అసైన్డ్ భూమిని పరిశ్రమలు ఏర్పాటు పేరిట అధికారులు బలవంతంగా తీసుకున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ శివారు ప్రాంతాలైన సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలో జరిగిన ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై విచారణ జరిపించి, చర్యలు తీసుకోవాలని ఎన్నికలకు ముందే పీసీసీ చీఫ్ హోదాలో రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా ఇప్పుడు ఉమ్మడి మెదక్ జిల్లాలోని కొందరు కాంగ్రెస్ నాయకులు, రైతులు అసైన్డ్ భూముల భాగోతంపై ఫిర్యాదు చేయడంతో ముఖ్యమంత్రి విచారణకు ఆదేశించినట్లు తెలిసింది.

ఆటోను ఢీకొన్న లారీ

- అయ్యప్ప మాలధారుడి మృతి
- మరో నలుగురికి గాయాలు, ఒకరి పరిస్థితి విషమం




అయ్యప్ప మాలధారుడు కాశయ్య మృతదేహం వద్ద రోదిస్తున్న కుమారులు, ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో



ఎంబరి కాశయ్య(ఫైల్)



తీవ్రంగా గాయపడిన వల్లూరి విఠల్

కల్హేర్, జనవరి 3: లారీ ఢీకొనడంతో ఆటోలో వెళ్తున్న అయ్యప్ప మాలధారుడు మృతిచెందాడు. మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. మహదేవ్‌పల్లి గ్రామానికి చెందిన ఆరుగురు అయ్యప్ప స్వామి మాలధారులు తోటి స్వాముల ఆహ్వానం మేరకు కామారెడ్డి జిల్లా పిట్లం మండలం పరిధిలోని మల్యాపూర్‌లో జరిగిన పడి పూజకు వెళ్లి తిరిగి వస్తున్నారు. మండల సరిహద్దులో ఉన్న కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ గ్రామ సమీపంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న ఆటోను లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎంబరి కాశయ్య(55) అక్కడికక్కడే మరణించాడు. అంజయ్య, విఠల్, లింగులుకు తీవ్ర గాయాలు కాగా, డ్రైవర్ సాయిలుకు స్వల్ప గాయాలైనట్లు వారు తెలిపారు. ఇందులో అంజయ్యకు కాళ్లు విరగగా, విఠల్ పరిస్థితి విషమంగా ఉండడంతో ఆయనను హైదరాబాద్‌కు తరలించారు. మిగతా వారిని ఎల్లారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఘటనా స్థలాన్ని నిజాంసాగర్ ఎస్ఐ రాజశేఖర్ పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ ఘటనతో మహదేవ్‌పల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

డీఈవో ఆఫీస్‌లో కనిపించని సమాచార హక్కు చట్టం బోర్డు

- జిల్లా విద్యాధికారి కార్యాలయంలో నిర్లక్ష్యం
- ఏ అధికారి పనిచేస్తున్నారో తెలియక ప్రజల అయోమయం



సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయ ప్రవేశ ద్వారం వద్ద కనిపించని సమాచార హక్కు చట్టం బోర్డు

సంగారెడ్డి అర్బన్, జనవరి 3: ఏ ప్రభుత్వ శాఖ కార్యాలయంలోనైనా సమాచార హక్కు చట్టం బోర్డు ప్రదర్శిస్తారు. అప్పిలేట్ ఆఫీసర్(అధికారి), పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, అసిస్టెంట్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ పేర్లతో బోర్డు రాసి ఉంచుతారు. కానీ సంగారెడ్డిలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో మాత్రం ఆ బోర్డు లేదు. వివిధ పనుల నిమిత్తం డీఈవో కార్యాలయానికి వివిధ వర్గాల ప్రజలు, ఉద్యోగులు ఇతరులు వచ్చిపోతుంటారు. ఈ క్రమంలో ఈ శాఖలో పనిచేస్తున్న ప్రధాన అధికారి, ఇతర అధికారులెవరో తెలుసుకోవాలంటే ఏర్పాటు చేసిన సహ చట్టం బోర్డు చూస్తే సరిపోతుంది. కానీ మూడేళ్లుగా ఈ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డును మూలకు చేర్చినట్లు సిబ్బంది చెప్పడం గమనార్హం. కార్యాలయం ప్రవేశ ద్వారం వద్ద సమాచార హక్కు చట్టం బోర్డు ప్రదర్శించకపోవడంతో అవగాహన లేక, అంత నిర్లక్ష్యంగా కార్యాలయ అధికారులు విధులు నిర్వహిస్తున్నారా అంటూ పలువురు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు.

జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ శరత్



పదో తరగతి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక బుక్ లెట్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి రూరల్, జనవరి 3: జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ శరత్ అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ శరత్‌కు అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను అన్నిరంగాల్లో ముందుంచేందుకు అధికార యంత్రాంగమంతా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జిల్లా అధికారులందరూ అంకితభావంతో పనిచేసి జిల్లా అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. నూతన సంవత్సరం అన్నీ శుభాలు చేకూర్చాలని, ప్రతిఒక్కరూ మరింత నూతనోత్తేజంతో పనిచేసి జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలని కలెక్టర్ శరత్ కోరారు. జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్, డీఆర్‌డీవో శ్రీనివాస్‌రావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, వ్యవసాయ శాఖ జేడీ నర్సింహారావు, డీఎస్ఓ నరసింహారెడ్డి, డీసీఓ విజయరాణి, వీరగౌ, సరోజ్ కుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'పది'లో జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలి

సంగారెడ్డి అర్బన్, జనవరి 3: పదో తరగతి ఫలితాల్లో జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ తన చాంబర్‌లో జిల్లా విద్యాశాఖ తయారుచేసిన పదో తరగతి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక బుక్‌లెట్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక బుక్‌లెట్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మండల విద్యాధికారులు, పాఠశాలల ప్రత్యేక అధికారులు ఈ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను ఆచరిస్తూ మార్చి 2014లో జరుగు పదో తరగతి ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి విజయకుమార్, డీసీఈబీ సెక్రటరీ లింబాజీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లా కలెక్టర్‌ను కలిసిన రేషన్ డీలర్లు

మెదక్ అర్బన్, జనవరి 3: రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో మెదక్ కలెక్టర్ రాజర్షిషాను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు సుధాకర్, విట్టలరెడ్డి, నర్సింలు, గోవర్దన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

- ఈనెల 18,19 తేదీల్లో నిర్వహణ
- డీఈవో రాధాకిషన్

మెదక్ అర్బన్, జనవరి 3: ఈ విద్యా సంవత్సరం జిల్లాస్థాయి విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు. ఈ నెల 10 తేదీలోపు ఆన్‌లైన్‌లో విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అన్ని పాఠశాలల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను వారి పాఠశాలల్లోనే ఏర్పాటు చేసుకోవాలని, వాటికి సంబంధించిన వీడియోను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఆరోగ్యం, పర్యావరణహిత జీవన విధానం, వ్యవసాయం, కమ్యూనికేషన్, రవాణా, కంప్యూటేషనల్ థింకింగ్‌పై ఈ నెల 18, 19వ తేదీల్లో ప్రదర్శనలు ఉంటాయన్నారు. 6 నుంచి 8వ తరగతి వరకు జూనియర్, 9 నుంచి 10వ తరగతి వరకు సీనియర్ విభాగాలుగా ఎంపికచేస్తారన్నారు. సైన్స్ గణిత ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి 8328599157 సంప్రదించాలని తెలిపారు.

ఐదో తరగతి ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు చివరి తేదీ 6

హుస్నాబాద్‌రూరల్, జనవరి 3: హుస్నాబాద్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి ప్రవేశం కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 6 వరకు అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఉదయం 11 నుంచి 1 గంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 2023, 2024లో నాల్గవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. పూర్తి వివరాలకు 9704550176 నెంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ కోరారు.

సైబర్ క్రైం కేసుల్లో నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టిన పోలీసులు

సంగారెడ్డి క్రైం, జనవరి 2: దేశవ్యాప్తంగా 277 సైబర్ క్రైం కేసులలో నిందితుడిగా ఉన్న వ్యక్తిని సంగారెడ్డి జిల్లా సైబర్ క్రైం పోలీసులు బుధవారం జిల్లా కోర్టులో హాజరుపరిచారు. బెంగుళూరులోని జేపీ నగర్‌కు చెందిన జితేంద్ర రెడ్డి(30) దేశవ్యాప్తంగా 277 సైబర్ కేసు పాల్పడ్డాడు. తెలంగాణలో కూడా అమాయక ప్రజల అవసరాలను ఆసరాగా తీసుకుని మోసాలకు పాల్పడ్డాడు. రాష్ట్రవ్యాప్తంగా 84 కేసులతో పాటు సంగారెడ్డి జిల్లాకు చెందిన 5 కేసులలో అతడు నిందితుడిగా ఉన్నాడు. సైబర్ నేరాలకు పాల్పడటానికి ఇతడు 60 ఫోన్ నంబర్లు, 63 ఫోన్ ఐఎంఐఐ నంబర్లు, 13 బ్యాంకు ఖాతాలను వినియోగించాడు. సంగారెడ్డి జిల్లాకు చెందిన గుమ్మడిదల పోలీస్‌స్టేషన్‌లో, బీడీఎల్ భానూర్ పోలీస్‌స్టేషన్‌లో నిందితుడిగా ఉన్న నేరస్థుడిని జిల్లా సైబర్ క్రైం పోలీసులు పీటీ వారెంట్‌పై సంగారెడ్డి జిల్లా కోర్టులో బుధవారం ప్రవేశపెట్టారు. నేరాలకు పాల్పడిన తీరు గురించి ఆధారా కోర్టులో రికార్డు చేశారు. అయితే ఇదివరలో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేయగా.. చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు.

అప్రమత్తంగా ఉండాలి: జిల్లా ఎస్పీ

ఆన్‌లైన్ మోసాలపై, సైబర్ నేరాల పట్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ సూచించారు. డబ్బులు ఉచితంగా వస్తున్నాయంటే దానికి వెనుక ఏదో కుట్ర ఉన్నదన్న విషయాన్ని గమనించాలన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఐఐటీహెచ్‌లో యువతకు ఉద్యోగావకాశాలు కల్పించండి

- ఐఐటీహెచ్ డైరెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కంది, జనవరి 3: ఐఐటీహెచ్‌లో చుట్టుపక్కల గ్రామాల నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తిని కోరారు. బుధవారం సాయంత్రం ఆయన నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో కలిసి కంది పరిధిలోని ఐఐటీహెచ్‌కు వెళ్లి డైరెక్టర్‌ను కలిశారు. ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తికి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో చాలామంది యువతీ, యువకులు ఉన్నత చదువులు చదువుకుని, ఉద్యోగాలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారందరికి ఐఐటీహెచ్‌లో ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. అంతేగాక ఐఐటీహెచ్ పరిసర గ్రామాల అభివృద్ధికి ఐఐటీహెచ్ తరఫున సహకారం అందించాలన్నారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ కృష్ణాగౌడ్, నాయకులు ఆర్.వెంకటేశ్వర్లు, మోహన్‌రెడ్డి ఉన్నారు.

మహనీయుల అడుగుజాడలు అనుసరణీయం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, స్థానిక ప్రజలు

గుమ్మడిదల, జనవరి 3: మహనీయుల అడుగుజాడలు అనుసరణీయమని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన అందిస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన గుమ్మడిదలలో వల్లభ సంఘం నూతన కార్యాలయం ప్రారంభోత్సవం, జీఎంఆర్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన ఆలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గ వ్యాప్తంగా సొంత నిధులతో మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేస్తూ వారి ఆశయాలను భవిష్యత్తు తరాలకు తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రవీణావిజయభాస్కర్ రెడ్డి, జడ్పీటీసీ కుమార్‌గౌడ్, సర్పంచ్ నరసింహారెడ్డి, వైస్ ఎంపీపీ మంజుల, సీనియర్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, ఇందుల సురేందర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు హుస్సేన్ పాల్గొన్నారు.

భార్యతో గొడవపడి ఆత్మహత్య



మహిపాల్(ఫైల్)

మెదక్ అర్బన్, జనవరి 3: భార్యాభర్తల మధ్య గొడవతో భర్త మనస్తాపం చెంది ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మెదక్ మండల పరిధిలోని మగ్దుంపూర్‌లో మంగళవారం చోటు చేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మహిపాల్(24)కు ఎనిమిది నెలల క్రితం చిన్నశంకరంపేట మండలానికి చెందిన దీపికతో వివాహం జరిగింది. అప్పటి నుంచి వారి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. నెలరోజుల కిందట భార్య దీపిక పుట్టింటికి వెళ్లి, పోలీస్‌స్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు చేసింది. నాటి నుంచి మహిపాల్ బాధపడుతూ ఉన్నాడు. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో మహిపాల్ మెదక్‌కు వెళ్లి తిరిగి వచ్చాడు. పొలం పనులకు వెళ్లిన తల్లిదండ్రులు సాయంత్రం 4 గంటలకు ఇంటికి వచ్చి చూడగా.. మహిపాల్ ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే చుట్టుపక్కల వారి సహాయంతో మృతదేహాన్ని కిందకు దింపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ అమర్ తెలిపారు.

రాజిరెడ్డిపల్లి కుంటలో పడి మహిళ మృతి

గజ్వేల్, జనవరి 3: మతిస్థిమితం లేని మహిళ కుంటలో పడి మృతిచెందిన సంఘటన గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని రాజిరెడ్డిపల్లిలో చోటుచేసుకున్నది. గజ్వేల్ మునిసిపాలిటీ పరిధిలోని 14వ వార్డుకు చెందిన బొల్లికొండ సాలవ్వ(47) బుధవారం ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయింది. సాలవ్వ ఆచూకీ కోసం భర్త వీరాస్వామి, కుమారుడు శ్రీకాంత్ వెతుకుతుండగా, చుట్టుపక్కల వారు చూసి సాలవ్వ రాజిరెడ్డిపల్లి కుంట వైపు వెళ్లిందని చెప్పారు. ఇంతలోగా వెళ్లి చూసేసరికి రాజిరెడ్డిపల్లి కుంటలో పడి మృతిచెంది కనిపించింది. సాలవ్వ కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ జానకిరెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని

బెజ్జంకి, జనవరి 3: గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు బెజ్జంకి మండలంలోని రేగులపల్లి రాజీవ్ రహదారిపై బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందినట్లు తెలిపారు. రేగులపల్లి పంచాయతీ కార్యదర్శి జీవన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిస్తే బెజ్జంకి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ వ్యక్తి మృతదేహం తెలిపారు.

పురుగుల మందు తాగిన యువకుడి మృతి



వినయ్(ఫైల్)

రాయపోల్, జనవరి 3: పురుగుల మందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. బేగంపేట ఎస్ఐ అరుణ్ వివరాల ప్రకారం.. రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామానికి చెందిన చాకలి వినయ్(16) స్నేహితులతో కలిసి చెడు తిరుగుళ్లకు అలవాటుపడ్డాడు. చెడు తిరుగుళ్లు మానుకుని ఏదైనా పని చేసుకోవాలని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన వినయ్ గతనెల 29న గ్రామంలోని పాఠశాల వద్ద గడ్డి మందు తాగి, దానిని తన ఫోన్‌లో స్టేటస్ పెట్టుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు అతడిని వెతికి పట్టుకునేలోగా అపస్మారక స్థితిలోకి వెళ్లిపోగా.. వెంటనే వంటిమామిడిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. తండ్రి ఎల్లేష్ చంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో, స్కూల్ బస్సు ఢీ, ఒకరి మృతి

- మరొకరికి గాయాలు, జిల్లా కేంద్రంలో ఘటన

మెదక్ అర్బన్, జనవరి 3: ఆటో, స్కూల్ బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా.. మరొకరికి గాయాలైన సంఘటన బుధవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. పట్టణ సీఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని డాన్‌బోస్కో స్కూల్‌కు చెందిన బస్సు కోర్టువైపు వెళ్తుండగా.. బోధన్ చౌరస్తా వైపు నుంచి అతివేగంగా వస్తున్న ఆటో బస్సు ఎడమవైపు వెనుక టైర్‌ను ఢీకొట్టింది. దాంతో ఆటోడ్రైవర్‌కు ఎడమవైపు కూర్చున్న హవేళీఘనపూర్‌కు చెందిన రమేందర్(50)కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతిచెందాడు. గాయపడిన ఆటోడ్రైవర్ అన్వర్‌ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

స్కూటీ అమ్ముతానంటూ రూ.75 వేలకు కుచ్చుటోపీ

హత్నూర, జనవరి 3: ఆన్‌లైన్ మోసానికి మరో యువకుడు బలయ్యాడు. డబ్బులు చెల్లించిన ఆ యువకుడు మోసపోయానని గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశాడు. హత్నూర మండలం కొన్యాల గ్రామానికి చెందిన చిలిపిచేడ్ నవీన్ అనే యువకుడు మంగళవారం ఫేస్‌బుక్‌లో అమ్మకానికి పెట్టిన స్కూటీ వాహనాన్ని చూశాడు. ఆ ఫేస్‌బుక్‌లో ఉన్న సెల్‌ఫోన్ నెంబరుకు ఫోన్‌చేసి ధర అడుగగా.. రూ.18 వేలు అని తెలిపాడు. అంతేకాకుండా అతడి వాట్సాప్‌కు ఆర్మీ కార్డు పంపాడు. అయితే అన్నీ సర్టిఫికెట్లు ఉన్నాయని భావించిన నవీన్ అమ్మకందారుడి ఫోన్‌పే నెంబరుకు రూ.18 వేలు పంపాడు. ఆ డబ్బులు నా అకౌంట్‌లో కనిపించడం లేదని, మరో రూ.13 వేలు పంపితే కనిపిస్తాయని స్కూటీ యజమాని చెప్పడంతో నవీన్ మళ్లీ రూ.13 వేలు ఫోన్ పే చేశాడు. ఇలా నాలుగు దఫాలుగా మొత్తం రూ.75 వేలు ఫోన్‌పే ద్వారా పంపాడు. ఈ స్కూటీ డబ్బులు వారి అకౌంట్‌లో పడగానే సదరు వ్యక్తి ఫోన్ స్విచ్చాఫ్ చేసుకున్నాడు. దీంతో తాను మోసపోయానని భావించిన ఆ యువకుడు వెంటనే 1903 నెంబరుకు సైబర్ క్రైమ్ పోలీసులకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశాడు.

యాసంగిలో వరి నారు పెంపకంలో జాగ్రత్తలివిగో!

- ఉష్ణోగ్రతలు తగ్గడంతో నారు ఎదగదు
- ముదురు నారు నాటడంతో దిగుబడి తగ్గుతుంది
- యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి




తోర్నాలలో సాగుచేసిన నారుమడి, ముదురు నారు నాటు వేయడం వల్ల ఎర్రబడిన వరి కర్రలు(ఫైల్)

సిద్దిపేటరూరల్, జనవరి 3: యాసంగిలో సాగు చేసే పంటలలో వరి ప్రధానమైనది. ముఖ్యంగా సిద్దిపేట జిల్లాలో యాసంగిలో స్వల్పకాలిక దొడ్డు గింజ రకాలైన ఎం.టి.యు. 1010, తెలంగాణ, ఐ.ఆర్. 64, కూనారం సన్నాలు (కె.ఎన్.ఎం-118), బతుకమ్మ, జగిత్యాల రైస్-1(జె.జి.ఎల్-24423), అలాగే సన్నగింజ రకాలైన తెలంగాణ సోనా, హెచ్.ఎం.టి. సోనా ప్రైవేట్ కంపెనీకి చెందిన రకాలను జనవరి మొదటి వారం వరకు నారు పోసుకొని పెట్టుకుంటున్నారు. యాసంగిలో రాత్రి ఉష్ణోగ్రతలు 12 డిగ్రీ సెల్సియస్ కంటే తక్కువ ఉన్నందున, చలి తీవ్రత పెరిగి నారు సరిగా ఎదగక ఎర్రబడి కొన్నిసార్లు చనిపోతుంది. అలాగే యాసంగిలో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయబడుతున్న స్వల్పకాలిక దొడ్డు గింజ రకాలలో ముదురు నారు నాటడం వల్ల దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయి. వరినాట్లు సరిగా ఎదగకపోవడం వల్ల వరినాట్లు ఆలస్యం అవుతుండడం పొలంలో మొక్కలు త్వరగా పిలకలు వేయకపోవడం వలన పాటి. వరి నాట్లు మరీ ఆలస్యమైతే పంట కోతలు ఆలస్యమై మేలో వచ్చే నీటి ఎద్దడికి గురయ్యే అవకాశం ఉంది. రోహిణిలో తరచుగా వచ్చే వడగండ్ల వర్షాలకు పంట నష్టం వాటిల్లే ప్రమాదముంటుంది. రైతులు యాసంగి వరి నారుమడి పెంపకంలో మెళకువలు పాటించి ఆరోగ్యవంతమైన నారు పెంచి సరైన సమయంలో నాట్లు వేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

- రైతులు ఖరీఫ్‌లో పండించిన విత్తనాలను యాసంగిలో సాగు చేయాలనుకున్నట్లయితే పండించిన రకం విత్తన నిద్రావస్థ గురించి అవగాహన ఏర్పరుచుకోవాలి. సాధారణంగా తెలంగాణ సోనా, ఎం.టి.యు. 1010 రకాలను 2 వారాలు... అలాగే కూనారం సన్నాలు (కె.ఎన్.ఎం-118), బతుకమ్మ, ఎం.టి.యు. 1001 రకం సుమారు 3 వారాల నిద్రావస్థ ఉందని గమనించాలి. నిద్రావస్థ తొలగించడానికి లీటర్ నీటికి 6.3 మి.లీ. గాఢ నత్రికామ్లం కలిపిన ద్రావణంలో కిలో విత్తనాన్ని 24 గంటలు నానబెట్టి కడిగి మండె కట్టాలి.

విత్తన శుద్ధి ఇలా..

మెట్ట నారుమళ్లకు అయితే కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండాజిమ్‌ను తడిలో పట్టించి ఆరబెట్టి నారుమడిలో చల్లుకోవాలి. దమ్ము చేసిన నారుమళ్లు అయితే లీటర్ నీటికి 1గ్రా. కార్బండాజిమ్ కలిపిన ద్రావణంలో 24 గంటలు నానబెట్టిన తర్వాత మండే కట్టి మొలకలను నారుమడిలో చల్లుకోవాలి.

- నారుమడి తయారీకి 1-2 వారాల ముందు 2 గుంటల నారుమడికి 2 క్వింటాలు, బాగా మాగిన గొర్రెల ఎరువు లేదా కోళ్ల ఎరువు లేదా వర్మికంపోస్టు వేసి పొలాన్ని బాగా కలియదున్నాలి. ఒక ఎకరానికి సరిపడా (2గుంటలు) నారుమడి ఆఖరి దుక్కిలో 1కిలో నత్రజని, 2కిలోల భాస్వరం, 1కిలో పొటాష్ నిచ్చే ఎరువులను వేయాలి. నారు 15 నుంచి 20 రోజుల దశలో పైపాటుగా 1కిలో నత్రజని (2కిలోల యూరియా) వేసుకోవాలి. అలాగే వరి నాటడానికి వారం ముందు కార్బోఫ్యూరాన్ 3జి. 800గ్రా. 2 గుంటల నారుమడికి వేయాలి.
- యాసంగిలో చలి సమస్యను అధిగమించడానికి నారుమళ్లపైన ఇనుప చువ్వలు/వెదురు కర్రలతో ఊతం ఇచ్చి పైన పలుచని పాలిథిన్ షీట్ లేదా పాలిథిన్ యూరియా బస్తాలతో తయారు చేసిన పట్టాలను సాయంత్రం వేళల్లో కప్పి ఉంచి మరుసటి రోజు ఉదయాన్నే తీసివేయాలి. అలాగే రాత్రివేళల్లో నారుమడిలో నీరు నిండుగా ఉంచి తెల్లవారుజామున తీసివేసి కొత్తనీరు పెట్టాలి. నారు ఆరోగ్యవంతంగా పెరగడానికి పైపాటుగా 2 గుంటల నారుమడికి కిలో యూరియాకు 2.5గ్రా. కార్బండాజిమ్+మ్యాంకోజెబ్ కలిపి వేసుకోవాలి.
- యాసంగిలో చలి ప్రభావం వల్ల నారుమడిలో జింక్ లోప లక్షణాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. జింకు లోప నివారణకు లీటరు నీటికి 2గ్రా. జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. నారుమడిలో ఊద, ఒడిపిలి వంటి గడ్డి జాతి కలుపు మొక్కలు ఉన్నట్లయితే విత్తిన 15 నుంచి 20 రోజుల్లో సైహలోఫాప్-పి-బ్యూటైల్ 1.5మి.లీ. లేదా బిస్ పైరిబాక్ సోడియం 0.5మి.లీను లీటరు నీటికి కలిపి నారుమడిలో నీరు తీసివేసి పిచికారీ చేయాలి. చలి వాతావరణం వల్ల యాసంగి నారుమడిలో అగ్గి తెగులు ఆశించే అవకాశం ఉన్నది. నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6గ్రా. లేదా ట్రైసైక్లోజోల్+ మ్యాంకోజెబ్ 2.5గ్రా. లేదా ఐసోప్రోథయోలేన్ 1.5మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. వరి నారు పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ అవసరం. సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించి ఆరోగ్యవంతమైన వరి నారు సరైన సమయంలో నాట్లు వేసుకున్నట్లయితే యాసంగిలో అధిక దిగుబడులను సాధించవచ్చు.

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయం

● నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



ఖేడ్‌లో లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, జనవరి 3: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, తమ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 45 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు, మహిళలు, యువకులు వృద్ధులతో పాటు వివిధ వర్గాల వారు ఆరు గ్యారంటీ పథకాలతో లబ్ధి పొందనున్నారన్నారు. ప్రజల వద్దకే ప్రభుత్వం వెళ్లి సమస్యలు తెలుసుకొని పథకాలను అర్హులకు వర్తింపజేయడానికే ప్రజాపాలనను నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజల సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చిన ప్రతీ హామీని కాంగ్రెస్ నెరవేరుస్తుంది

● వక్ఫ్‌బోర్డు భూముల పరిష్కారానికి కృషి
● వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్
● రాయికోడ్‌లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

రాయికోడ్, జనవరి 3: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తుందని, అర్హులైన అందరికీ పథకాలు అందుతాయని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన రాయికోడ్‌లో ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఆరు గ్యారంటీల పథకాలు అందిస్తామని పేర్కొన్నారు. కర్చల్, సింగితం గ్రామాల ప్రజల సౌకర్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేస్తామని చెప్పారు. మండలంలో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, గత 10 సంవత్సరాల నుంచి మరమ్మతులు కూడా చేయలేదన్నారు. రోడ్లకు మరమ్మతులు చేసి ప్రజారవాణా వ్యవస్థను మెరుగుపర్చుతామని హామీ ఇచ్చారు. వక్ఫ్‌బోర్డు భూముల పేరిట గత ప్రభుత్వంలో ఇబ్బందులు పడిన రైతుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. బీసీ శ్మశాన వాటిక స్థల పరిశీలన కోసం కృషి చేస్తానన్నారు. కాగా తప్పులు లేకుండా ఫారాల్లో పూర్తి వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ శరత్ దరఖాస్తుదారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, ఆర్డీవో వెంకటరెడ్డి, ఎంపీపీ మమత, సర్పంచ్ కేదారినాథ్‌పాటిల్, ఎంపీటీసీ మొగులప్ప, మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో వెంకటేశం, డీఎస్పీ రఘు, జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేశం, ఎస్ఐ వెంకటరెడ్డి, మాజీ జడ్పీటీసీ అంజయ్య, ఉప సర్పంచు రామకృష్ణ, నాయకులు ప్రభాకర్‌చారి, సతీష్‌కులకర్ణి, రాజుగౌడ్, డాక్టర్ వెంకటేశం, సతీష్‌కుమార్,మొహమ్మద్, రఫీ, యేసయ్య, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.



రాయికోడ్‌లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో లబ్ధిదారుకు రసీదును అందజేస్తున్న మంత్రి దామోదర్

ఆదుకోవాలని మంత్రికి 104 ఉద్యోగుల వినతి

సంగారెడ్డి రూరల్: గత ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని, కనీసం మీరైనా తమను ఆదుకోవాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు 104 ఉద్యోగులు విన్నవించారు. సంగారెడ్డిలోని మంత్రి నివాసంలో బుధవారం 104 ఉద్యోగులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ. నుస్రత్ మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలుగా అనేక ఇబ్బందులు పడ్డామని, గ్రామాల్లో 104 వాహనాల ద్వారా మందులు సరఫరా చేశామని తెలిపారు. గత ప్రభుత్వం తమకు వేతనాలు కూడా సక్రమంగా చెల్లించలేదని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలను అమలు చేయలేదని ఆరోపించారు. తమ సమస్యలు పరిష్కరించి ప్రతి నెల వేతనాలు సక్రమంగా అందేలా చూడాలని, ట్రెజరీ ద్వారా వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. స్పందించిన మంత్రి దామోదర్ వైద్యశాఖ సెక్రటరీతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

టీపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

సంగారెడ్డి అర్బన్: తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని బుధవారం మంత్రి దామోదర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాంచందర్, రాష్ట్ర కౌన్సిలర్లు సంజీవయ్య, లక్ష్మయ్యయాదవ్, సోమశేఖర్, రాజారెడ్డి, నాసర్‌పటేల్ పాల్గొన్నారు.

రీజినల్ స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన



కార్యక్రమ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోతి

నర్సాపూర్, జనవరి 3: నర్సాపూర్ గిరిజన గురుకులంలో బుధవారం రీజినల్ స్థాయిలో రెండురోజుల పాటు నిర్వహించే విద్యావైజ్ఞానిక ప్రదర్శనను ఎంపీపీ జ్యోతిసురేష్‌నాయక్, రీజినల్ కో ఆర్డినేటర్ సంపత్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ.. విద్యావైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించవచ్చన్నారు. విద్యార్థులు బాగా చదవుకుని ఉన్నత లక్ష్యంతో ముందుకుసాగాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సునీతాబాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ భిక్షమయ్య పాల్గొన్నారు. ప్రదర్శనలో 24 రకాల ప్రదర్శనలు ఉంటాయని, అందులో ఆర్ట్స్, కల్చరల్, యూత్‌పార్లమెంటు, సైన్సుఫేర్, ఉపన్యాసం, వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్, ఫ్యాన్సీ తదితర అంశాలు ఉంటాయని రీజినల్ కో ఆర్డినేటర్ సంపత్‌కుమార్ తెలిపారు.

జహీరాబాద్ పార్లమెంట్‌లో బీజేపీ గెలుపు ఖాయం



ఖేడ్‌లో మాట్లాడుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, జనవరి 3: రానున్న ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ గెలవడం ఖాయమని ఉమ్మడి మెదక్‌జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన నారాయణఖేడ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ- ప్రధాని మోదీ దేశంలో విద్యాభివృద్ధితో పాటు రైతాంగ సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకున్నారని, ప్రపంచ దేశాలు మెచ్చేలా పని చేశాడన్నారు. జహీరాబాద్‌పార్లమెంట్ నియోజకవర్గం నుంచి తన అభ్యర్థిత్వానికి అధిష్ఠానం ఖరారు చేస్తుందన్నారు. సమావేశంలో న్యాల్‌కల్ మాజీ జడ్పీటీసీ శివాజీపాటిల్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు ఏక్‌నాథ్‌పాటిల్, నాయకులు బుచ్చిరెడ్డి, కార్తిక్ రెడ్డి, అప్సర్, దిల్‌దార్, గోవింద్‌రావు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలి

చిలప్‌చెడ్, జనవరి 3: మెదక్ జిల్లాను రాజన్న సిరిసిల్లా జోన్ నుంచి తొలగించి చార్మినార్ జోన్‌లో కలపాలని కోరుతూ జగ్గంపేట సర్పంచ్ మాంతప్ప, గ్రామస్థులతో కలిసి తహసీల్దార్ ముసాదిక్‌కు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి హాజరైన తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోచయ్య, ఎంపిఎస్‌వో వెంకటేశం, కార్యదర్శి యాదగిరి, నరేష్, సుభాష్‌గౌడ్, మాణిక్యరెడ్డి, శ్రీనివాస్, చంద్రమోహన్, రమేష్, ఎల్లయ్య మల్లేశం, పెంటయ్య పాల్గొన్నారు.

హరీశ్‌రావును కలిసిన నేతలు

తూప్రాన్: మాజీ మంత్రి హరీశ్‌రావును తూప్రాన్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు బుధవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బొల్లంపల్లి బాబుల్‌రెడ్డి, పట్టణ నాయకుడు చింతల దశరథ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తూప్రాన్ మండల మల్కాపూర్ గ్రామ నాయకులు, ఉపసర్పంచు పంజాల ఆంజనేయులుగౌడ్, బీఆర్ఎస్ నాయకులు మన్నె నవీన్ యాదవ్, జింక శేఖర్, పిట్ల కరుణాకర్, జిన్న కృష్ణ కూడా హరీశ్‌రావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బోరుమోటారు పనులు ప్రారంభం

జిన్నారం: నీటి సమస్య పరిష్కారానికి ఊట్ల పంచాయతీ పరిధిలో బోరు మోటారు పనులను ఎంపీపీ రవీందర్ గౌడ్ ప్రారంభించారు. బుధవారం మండల పరిషత్ నిధులతో ఊట్ల రాంనగర్ కాలనీ, మంగంపేట గ్రామాలలో బోరు వేయించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగు రమేష్, సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, ఉప సర్పంచ్ రవి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన

పెద్దశంకరంపేట: పేద, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నదని పెద్దశంకరంపేట మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. బుధవారం పెద్దశంకరంపేటలోని ఆరేపల్లిలో నిర్వహించిన వికసిత్ భారత్ కార్యక్రమంలో కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను గ్రామస్తులకు ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా వివరించారు. పేద, అణగారిన వర్గాలకు సామాజిక భద్రత కల్పించడం కోసం పీఎం జన్ ధన్ యోజన, పీఎం సురక్ష బీమా యోజన, పీఎం జీవనజ్యోతి తదితర పథకాలను అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ నోడల్ అధికారి వినయ్‌కుమార్, సర్పంచ్ రుక్మిణీబాయ్, మండలవైద్యాధికారులు వేదశ్రీ, వేద్రాద్రి, వైద్య సిబ్బంది సాయిలు, యాదయ్య, వెటర్నరీ, సిబ్బంది మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అజ్మత్, మండల బీజేపీ నాయకులు బండాల శ్రావణ్ కుమార్, మంగళకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గెజిటెడ్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిలర్‌గా జగదీష్

నారాయణఖేడ్: తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిలర్‌గా నారాయణఖేడ్ మండలం పిప్రికి చెందిన కీలే జగదీశ్వర్ ఎన్నికయ్యారు. జగదీశ్వర్ రాజనీతి శాస్త్ర అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తనను కౌన్సిలర్‌గా ఎన్నుకున్నందుకు ఆయన ఆనందం వ్యక్తం చేశారు. తనపై నమ్మకం ఉంచి, కౌన్సిలర్‌గా ఎన్నుకున్నందుకు గెజిటెడ్ లెక్చరర్ల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

ఎల్వోసీ ఉత్తర్వులు అందజేత

నారాయణఖేడ్: మండల పరిధిలోని సంజీవన్‌రావుపేటకు చెందిన మనెమ్మ, ప్రేమ్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, సిఫార్సుతో వారి చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.1.50 లక్షల చొప్పున ఆర్థిక సహాయానికి సంబంధించిన ఎల్వోసీలను మంజూరు చేయించారు. బుధవారం భూపాల్‌రెడ్డి ఆయా బాధిత కుటుంబీకులకు అందజేశారు.

బండపోతుగల్‌లో

నర్సాపూర్: చిలప్‌చెడ్ మండలం బండపోతుగల్ గ్రామానికి చెందిన బుదేమ్మకు మంజూరైన ఎల్‌వోసీని బుధవారం పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు.

ఆరుగ్యారంటీల లబ్ధికి దరఖాస్తు చేసుకోవాలి

● జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, జనవరి 3: ఆరు గ్యారంటీల పథకాల లబ్ధికి అర్హులైన ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు సూచించారు. బుధవారం జహీరాబాద్ మండలంలోని ఆనెగుంట, సత్వార్ గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. దరఖాస్తులను నింపడంలో ప్రజలకు సందేహాలుంటే అధికారులు నివృత్తి చేయాలన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో అందరికీ దరఖాస్తు ఫారాలను విధిగా అందజేయాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మశ్చేందర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తట్టు నారాయణ, నాయకులు చిన్నపాటిల్, హీరురాథోడ్, జగదీష్, అధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా క్యాంపు కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గడ్డం జనార్ధన్, ప్రధాన కార్యదర్శి రాజేందర్‌రావు, సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సదాశివపేటలో అభయహస్తం దరఖాస్తులను స్వీకరిస్తున్న కాంగ్రెస్ నేత రాయిపాడ్ రమేష్

ఆరుగ్యారంటీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి

శివ్వంపేట: ప్రభుత్వం ప్రకటించిన ఆరుగ్యారంటీల పథకాలను సత్వరమే అమలు చేసే విధంగా ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఒత్తిడి చేస్తామని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దొంతి, నవాబుపేట గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం వందరోజుల్లో ఆరుగ్యారంటీల పథకాలు ప్రజలకు అందేలా తమవంతు ప్రయత్నం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మన్సూర్, తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, ఎంపీడీవో భారతి, సర్పంచులు శశాంక్‌శర్మ, అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీపద్మారెడ్డి, నాయకులు లక్ష్మీకాంతరావు, శ్రీనివాస్‌గౌడ్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులో రేషన్‌కార్డు ఆప్షన్‌ను చేర్చాలి: సీపీఎం

నారాయణఖేడ్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో అభయహస్తం దరఖాస్తు ఫారాల్లో నూతన రేషన్ కార్డులు పొందేందుకు యువ వికాసం గురించి ఆప్షన్‌లను చేర్చాలని సీపీఎం నాయకులు మాణిక్యం, అరుణ్, రాములు, సతీష్, పవన్,రాజు, సంతోష్ కోరారు. బుధవారం ఆర్డీవో వెంకటేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. రేషన్‌కార్డులుచ యువ వికాసానికి సంబంధించి ఆప్షన్ లేకపోవడంతో అనేక మంది తమ అవసరాలను దరఖాస్తుల్లో చేర్చలేకపోతున్నారన్నారు. అందువల్ల దరఖాస్తుల్లో ఈ ఆప్షన్‌లను కూడా చేర్చాలని కోరారు.



దొంతిలో దరఖాస్తు స్వీకరిస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి

ఆరు గ్యారంటీల అమలుకే ప్రజాపాలన

సదాశివపేట: ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు కోసమే ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తున్నదని సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ రాయిపాడ్ రమేష్ అన్నారు. బుధవారం పట్టణంలో 14వ వార్డులో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో కౌన్సిలర్ పి.రేణుకతో కలసి రాయిపాడ్ రమేష్ ప్రజల నుంచి అభయహస్తం దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. దేశంలో కాంగ్రెస్ సాధించిన విజయాలు ఏ పార్టీ సాధించలేదన్నారు. ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకునేందుకే సోనియాగాంధీ ఆదేశాలతో సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నారని చెప్పారు.

ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతలు



అక్షింతలను పంపిణీ చేస్తున్న దృశ్యం

సంగారెడ్డి టౌన్, జనవరి 3: శ్రీరామ జన్మభూమి క్షేత్ర, తీర్థ ట్రస్టు ద్వారా అందిన అయోధ్య రాముడి అక్షింతలను సంగారెడ్డిలో బుధవారం ప్రగతినగర్ సొసైటీ అధ్యక్షుడు తోమాల కొండస్వామి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఇంటింటికీ అందజేశారు. కార్యక్రమంలో ప్రగతినగర్ సొసైటీ సభ్యులు పిరియా నాయక్, సిద్ధప్ప, శంకర్, శివకుమార్, భక్తులు పాల్గొన్నారు.

కమిషనర్‌తో బీజేపీ కౌన్సిలర్ల వాగ్వాదం



నర్సాపూర్ కమిషనర్‌తో వాగ్వాదానికి దిగిన కౌన్సిలర్లు

నర్సాపూర్, జనవరి 3: నర్సాపూర్ పట్టణంలోని 10వ వార్డులో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో వార్డు అధికారి తీరును నిరసిస్తూ బీజేపీ కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్‌తో వాగ్వాదానికి దిగారు. 10వ వార్డు అధికారి దరఖాస్తు ఫారాలు రిజిస్టర్‌లో నమోదు చేయకుండానే ఇతరులకు నిబంధనలకు విరుద్ధంగా అందజేశాడని కౌన్సిలర్లు బుచ్చేష్ యాదవ్, రాజేందర్ కార్యక్రమం వద్ద నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న కమిషనర్ వెంకట్‌గోపాల్ అక్కడకు చేరుకోగా ఆయనతో కూడా కౌన్సిలర్లు వాగ్వాదానికి దిగారు. వార్డు అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

కేంద్రం తీరుకు వ్యతిరేకంగా లారీ డ్రైవర్ల నిరసన

సంగారెడ్డి రూరల్/పెద్దశంకరంపేట, జనవరి 3: కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకువచ్చి లారీ డ్రైవర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నదని లారీ డ్రైవర్ల యూనియన్ నాయకులు ఆరోపించారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో బుధవారం కేంద్రానికి వ్యతిరేకంగా లారీ డ్రైవర్లు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పెద్దశంకరంపేటలో బస్టాండ్ నుంచి రాణా వరకు నిరసన ర్యాలీ చేపట్టి నిబంధనను ఎత్తి వేయాలని కోరారు. ఏడాదికి ఒక డ్రైవర్ రూ.లక్ష కూడా సంపాదించలేని స్థితిలో ఉంటారని, ఇలాంటి కఠిన నిబంధన ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. నిరసన ర్యాలీలో హుస్సేన్, యాదుల్, ధన్‌రాజ్, మౌలాన, హమీద్, వీరాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.





సంగారెడ్డిలో బైక్‌ర్యాలీ తీస్తున్న లారీ డ్రైవర్లు, పెద్దశంకరంపేటలో ర్యాలీ నిర్వహించిన లారీ డ్రైవర్లు

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత



వీరహనుమాన్ మందిరంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట, జనవరి 3: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. బుధవారం సదాశివపేట మండలం మాలపాడు గ్రామంలో వీర హనుమాన్ మందిర శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఆయన పాల్గొని, ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడారు. ప్రతి మనిషికి ఆధ్యాత్మిక చింతన ఎంతో అవసరమన్నారు. భగవంతున్ని ధ్యానించడంతో మానసిక బలంతోపై జీవితాన్ని సుఖమయం చేసుకునే ఆస్కారం ఉంటుందన్నారు. ఆయనవెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు, సర్పంచ్ క్రిష్ణ, ఎంపీటీసీ సంతోష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, వెల్దూర్ సర్పంచ్ పబ్బతి లక్ష్మారెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి ఉన్నారు.

హనుమాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ట

గుమ్మడిదల, జనవరి 3: గుమ్మడిదల మండల కేంద్రంలో నిర్మించిన హనుమాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ఉదయం నుంచి వేదపండితులు విగ్రహ ప్రతిష్ట ఉత్సవ మహోత్సవాన్ని పురస్కరించుకొని పూజా కార్యక్రమాలు, యజ్ఞం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలో పాల్గొన్నారు. తొగుట పీఠాధిపతి మాధవనంద స్వామి సరస్వతి, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఎంపీపీ సద్ది ప్రవీణభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ కుమార్‌గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పడమటి లక్ష్మారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



యజ్ఞం నిర్వహిస్తున్న వేద పండితులు

ఘనంగా ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు

నర్సాపూర్, జనవరి 3: నర్సాపూర్ రాయరావు చెరువు సమీపంలో ఉన్న ఎల్లమ్మ ఆలయ బోనాల ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. యాదవ కులస్థుల ఆధ్వర్యంలో ప్రతిఇంటి నుంచి బోనాలను తీసుకుని ఆలయం వద్దకు వెళ్లి,అమ్మవారికి సమర్పించారు. బోనాలు సమర్పించని వారు బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పీహెచ్‌సీకి పరుపుల వితరణ



చిన్నశంకరంపేటలో పరుపులను అందజేస్తున్న దుర్గాప్రసాద్

చిన్నశంకరంపేట, జవవరి 3: పట్టణంలోని పీహెచ్‌సీకి చార్టడ్ ఎకౌంటెంట్ ఎన్.దుర్గాప్రసాద్ పరుపులను అందజేశారు. రూ.10వేల విలువజేసే పరుపులను బుధవారం ఆస్పత్రి వర్గాలకు ఆయన అందజేశారు.

మహిళా లోకానికే ఆదర్శం సావిత్రీబాయి పూలే

● జయంతి కార్యక్రమాల్లో వక్తలు

సంగారెడ్డి అర్బన్/సంగారెడ్డి రూరల్/జహీరాబాద్/నారాయణఖేడ్/జిన్నారం/పెద్దశంకరంపేట/టేక్మాల్/నాగల్‌గిద్ద/చిన్నశంకరంపేట/తూప్రాన్, జనవరి 3: మహిళా లోకానికే సావిత్రీబాయి పూలే ఆదర్శమని కలెక్టర్, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు, యువజన సంఘాల నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు కొనియాడారు. సావిత్రీబాయి పూలే జయంతిని బుధవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తికే వన్నె తేవడమే కాకుండా గొప్ప రచయిత, సంఘ సంస్కర్త, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన మాతృమూర్తి సావిత్రీబాయి పూలే అని కొనియాడారు. స్త్రీ అభ్యుదయవాది, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన వీరవనిత సావిత్రీబాయి పూలే పోరాట స్ఫూర్తిని ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. టేక్మాల్‌లోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. కలెక్టర్ రాజర్షిషా హాజరై ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాధాకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బాలమని పాల్గొన్నారు. జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ఎమ్మెల్యే మాణిక్‌రావు పూలమాలలు ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని మాణిక్‌ప్రభు ఉన్నత పాఠశాలలో డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి సావిత్రీబాయి పూలే గురించి మాట్లాడారు. సంగారెడ్డి తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ, అధ్యాపకులు పాల్గొన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే విగ్రహానికి జిల్లా కన్వీనర్ ఆకాశ్, జన జాగృతి సేన అధ్యక్షుడు బంగారు కృష్ణ నివాళులర్పించారు. కార్యక్రమంలో విభాగ్ హాస్టల్ కన్వీనర్ తానాజీ, శశాంక్, దినేశ్, నిఖిల్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు. సంగారెడ్డిలో సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలకు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ నివాళులర్పించారు. అలాగే సంగారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభుగౌడ్ పూలే దంపతుల విగ్రహాలకు ఘనంగా నివాళులర్పించారు. నారాయణఖేడ్ మండలం జూకల్ శివారులోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకులంలో సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని విద్యార్థులు సావిత్రిబాయి, జ్యోతిబాపూలే వేషధారణతో ఆకట్టుకున్నారు. ఖేడ్‌లో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొటారి నర్సింలు, నాయకులు రమేష్, కిరణ్, బీరప్ప, గౌతంరాజు, సీఐటీయూ నాయకులు చిరంజీవి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. జిన్నారంలో సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద ఎంపీపీ రవీందర్‌గౌడ్, వివిధ సంఘాల నాయకులు ఏర్పుల శ్రీనివాస్, నరేష్, నీలం లత, స్వామి, శ్రీనివాస్‌యాదవ్, పుట్టి భాస్కర్, ప్రశాంత్, విష్ణుమూర్తి నివాళులర్పించారు. పెద్దశంకరంపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాందేడ్‌దుర్గయ్య, మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పున్నయ్య, అంబేద్కర్ యూత్ ఉపాధ్యక్షులు నాగరాజు, శివకుమార్, విజయ్‌కుమార్, శంకరయ్య, తుకారం, ఆశయ్య, బాలరాజు పాల్గొన్నారు. నాగల్‌గిద్ద మండలపరిధిలోని మోర్గిమోడల్ కళాశాలలో ప్రిన్సిపాల్ రమేష్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. చిన్నశంకరంపేట మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేందర్, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె పోచయ్య, శ్రీనివాస్, శంకర్, భాస్కర్, మల్లేష్, వినయ్, సాగర్ పాల్గొన్నారు. తూప్రాన్ పట్టణంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే 193వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తూప్రాన్ పట్టణ బాలికల ఉన్నత పాఠశాలలో నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నలింగ్ మల్లికార్జున్‌గౌడ్, ప్రధానోపాధ్యాయులు ఫ్లోరెన్స్, ఉపాధ్యాయులు లక్ష్మీ, విజయకుమారి, బీసీ సంఘం నాయకులు బండ నాగరాజుయాదవ్, దుర్గి శివ, గడ్డం వెంకట్, బాలేష్ పాల్గొన్నారు.



టేక్మాల్ పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతిలో పాల్గొన్న మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించిన జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు



సంగారెడ్డిలో జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



జ్యోతిరావుపూలే దంపతుల వేషధారణలో ఖేడ్ జ్యోతిబాపూలే గురుకుల విద్యార్థులు